నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 27 ఆగస్టు 2024 | NIZAMABAD

షరతుల్లేని మాఫీ చేయాల్సిందే

- సెప్టెంబర్ 15లోపు పూర్తి కావాలి
- లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ హెచ్చరిక
- కాలయాపనకే రైతుభరోసా యాప్ తెచ్చారని ఆగ్రహం
- స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలనడం దారుణమని మండిపాటు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 26: కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు షరతుల్లేని రుణమాఫీ, రూ.7500 చొప్పున రైతుభరోసా హామీలను వెంటనే అమలు చేయాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకపోతే అన్నదాతల ఆగ్రహాన్ని రేవంత్ ప్రభుత్వం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్మూర్‌లో ఇటీవల పార్టీలకు అతీతంగా, శాంతియుతంగా నిర్వహించిన మహాధర్నా ప్రభుత్వంలో చలనం తెప్పించిందన్నారు. సెప్టెంబర్ 15లోగా అర్హులందరికీ రూ.2 లక్షల మాఫీ చేయాల్సిందేనని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఆర్మూర్‌లో ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు ఇట్టడి లింగారెడ్డి, ప్రభాకర్, దేగాం యాదాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న నిర్వహించిన మహాధర్నాను విజయవంతం చేసిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. సిద్ధులగుట్ట సాక్షిగా ఏకకాలంలో రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. కొంత మందికి రుణాలు మాఫీ చేసి, మిగతా వారికి ఎగ్గొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని యాదాగౌడ్ అన్నారు.

ఆర్మూర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

రూ.2 లక్షలకు పైనున్న రుణాలను ముందుగా కడితేనే మాఫీ చేస్తామన్న షరతును తొలగించాలని డిమాండ్ చేశారు. రుణాల మాఫీతోపాటు రైతుభరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రూ.5 వేలు సరిపోవడం లేదని, అధికారంలోకి వస్తే రూ. 7,500 అందిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, సెప్టెంబర్ వస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసా అమలు విషయంలోనూ కుట్రలు, కుతంత్రాలకు ప్రభుత్వం తెరలేపుతున్నట్లు కనిపిస్తున్నదన్నారు. రేషన్‌కార్డు, కుటుంబాలను ప్రామాణికంగా తీసుకోకుండా అర్హులైన అందరి రుణాలను రద్దు చేయాలని వి.ప్రభాకర్ స్పష్టం చేశారు. రైతులు చేపట్టిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చినట్లే కనిపిస్తున్నా, మరో కండిషన్‌ను తెరపైకి తెచ్చారని ఇట్టడి లింగారెడ్డి తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీ యాప్ తీసుకొచ్చిందని, రైతులే కుటుంబాలకు సంబంధించి స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలనడం, డిక్లరేషన్‌లో తప్పులుంటే శిక్షిస్తామనడం దారుణమన్నారు. కాలయాపనకే ఇలాంటివన్నీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన లింగారెడ్డి.. కాలయాపన చేస్తే ప్రభుత్వానికి ఉద్యమ తీవ్రత చూపిస్తామన్నారు.

29న మండల కేంద్రాల్లో ధర్నా

ఖలీల్‌వాడి, ఆగస్టు 26: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వెంటనే చేయాలని ఈ నెల 29న మండల కేంద్రాల్లో ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం నాయకుడు రమేశ్‌బాబు తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని, రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆబాల గోపాలం

మాక్లూర్ మండలం గొట్టుముక్కలలో గోపాలకాల్వ ఎక్కుతున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, గోపాలకాల్వ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

డిచ్‌పల్లిలో ఉట్టికొడుతున్న యువకులు, చిన్నారులు

బ్యాంకు టు ఏవో | ఏవో టు బ్యాంకు
ప్రదక్షిణలు..

- రైతుల గగ్గోలు.. సర్కారులో స్పందన కరువు
- వడ్డీ కట్టినా మాఫీ జరగని వైనం
- కాంగ్రెస్ సర్కారు దగా చేసిందని రైతుల విమర్శలు

రుణమాఫీపై సర్కారు తీరుతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అన్ని అర్హతలున్నా మాకు రుణమాఫీ రాలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొందరేమో అప్పులు తెచ్చి వడ్డీ కట్టినా మాఫీ వర్తించకపోవడంతో లబోదిబోమంటున్నారు. బ్యాంకు వెళ్తే.. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాలని...ఆఫీసర్లను కలిస్తే బ్యాంకుకు వెళ్లాలంటూ తిప్పుతున్నారని మండిపడుతున్నారు. భారమైనా భరిస్తూ ఎక్కడికెళ్లినా సరైన స్పందన రావడం లేదంటున్నారు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ మూడు విడుతలూ గందరగోళంగా మారాయని విమర్శిస్తున్నారు. అందరికీ మాఫీ చేస్తామని నమ్మించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కొర్రీల పేరిట కర్రుకాల్చి వాత పెట్టిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

– నాగిరెడ్డిపేట/కోటగిరి, ఆగస్టు 26

మిత్తి కట్టినా మాఫీ కాలేదు..

నాగిరెడ్డిపేట, ఆగస్టు 26: మా కుటుంబానికి యూనియన్ బ్యాంకులో రూ.2లక్షల క్రాప్‌లోన్ ఉన్నది. మూడో విడుత అయిపోయినా రుణమాఫీ వర్తించలేదు. నా భార్య భూదమ్మకు, నాపేరున చెరో రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షల లోన్ ఉన్నది. రెండో విడుత రుణమాఫీ ప్రకటించిన తర్వాత వెళ్లితే..ఇద్దరికీ రూ.లక్ష చొప్పున రుణమాఫీ పోగా భూదమ్మ రూ.12వేల మిత్తి, నా పేరిట రూ.12వేల మిత్తి కట్టేస్తే వర్తిస్తుందని చెప్పిండ్రు. వెంటనే మిత్తి కట్టేశాను. తర్వాత వెళ్లి అడిగితే రుణమాఫీ కాలేదని చెబుతున్నారు.

- నాయికోటి రాములు, మాల్తుమ్మెద

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నం..

ఇప్పటి వరకు రుణమాఫీ జరగలేదు. నా పేరున రూ.లక్షా20వేలు, నా కొడుకు యాదగిరి పేరిట రూ.70వేలు యూనియన్ బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకున్న. నెల రోజుల నుంచి బ్యాంకు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ శాఖ కార్యాలయం వెళ్లమంటున్నారు.

- కొర్వి సత్యనారాయణ, మాల్తుమ్మెద

రూ.44 ఎక్కువయ్యాయని వర్తించలేదంట..

కోటగిరి, ఆగస్టు 26: నాపేరు దుమాలే మానప్ప. హెగ్డోలి శివారులో1.38 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఎత్తొండ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులోరూ.96012 క్రాప్‌లోన్ ఉన్నది. హెగ్డోలి శివారులో నా భార్య దుమాలే లత పేరిట రెండు ఎకరాలు ఉన్నది. లత పేరిట హెగ్డోలి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1,04,032 క్రాప్ లోన్ తీసుకున్నం. ఇద్దరికీ కలిపి రూ.2,00,044 లోన్ ఉన్నది. మాకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని వ్యవసాయాధికారికి అడిగితే మీరు తీసుకున్న లోన్ రూ.2లక్షల కన్నా 44 రూపాయలు అధికంగా ఉన్నదని, ప్రస్తుతం పరిశీలనలో ఉన్నదని చెప్పిండ్రు.

- దుమాలే మానప్పా, రైతు, హెగ్డోలి

ఉన్నదే 18వేల లోన్.. ఇప్పటికీ మాఫీ కాలే

నాకు ఉన్నదే ముప్పావు ఎకరం భూమి. తీసుకున్న రుణం, మిత్తి కలిపి రూ.18 వేలు ఉన్నది. కానీ ఇప్పటికీ మాఫీ కాలేదంటున్నారు. రోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. బ్యాంకోళ్ల తప్పా లేక వ్యవసాయ శాఖోల్ల తప్పా తెలియదు. కానీ, మాకు మాత్రం నిత్యం చుక్కలు చూపిస్తున్నారు.

- అగ్గు పాపయ్య, తాండూర్

నెల నుంచి తిప్పుతున్నారు..

నా పేరు మీద మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండడంతో యూనియన్ బ్యాంకులో రూ.లక్ష లోన్ తీసుకున్న. ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ కాలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే వ్యవసాయ శాఖ వద్దకు వెళ్లమంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే రూ.లక్ష రుణమాఫీ ఎప్పుడో అయ్యింది. మేనేజర్‌ను అడుగుమంటున్నారు. నెల రోజుల నుంచి తిరుగుతూనే ఉన్న. అందరికీ వచ్చింది.. మాకెందుకు ఇవ్వడం లేదో..అర్థం కావడం లేదు. నెల రోజులుగా తిప్పలు పెడుతున్నారు.

- పోచమ్మల సిద్ధిరాములు,మేజర్‌వాడీ

రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి 'ఫీవర్'పట్టుకున్నది. విష జ్వరాలతో వణికిపోతున్నది. ఊరు ఊరంతా మంచం పట్టింది. పక్షం రోజుల వ్యవధిలోనే భూంపల్లిలో ఇద్దరు, సదాశివనగర్ మండలంలో ఒకరు జ్వరంతో మృతి చెందడం కలకలం రేపింది. పారిశుద్ధ్య చర్యలు కొరవడడం, దోమలు విజృంభించడంతో భూంపల్లిలోని ప్రతి ఇంటా విషజ్వరాలతో బాధ పడుతున్నారు. కొన్ని కుటుంబాలకు కుటుంబాలు జ్వర బాధితులుగా మారడంతో వారి ఆలనాపాలన చూసే వారే లేకుండా పోయారు.

–రామారెడ్డి, ఆగస్టు 26



పల్లెకు ఫీవర్
వణికిపోతున్న భూంపల్లి

- భూంపల్లిలో విషజ్వరాల వ్యాప్తి
- ఇంటింటా బాధితులు
- కలవరపెడుతున్న మరణాలు
- వైద్యశిబిరాలు పెట్టినా తగ్గని తీవ్రత
- ఆర్‌ఎంపీల వైద్యంతోనే వారు చనిపోయారట
- వైద్యాధికారుల వివరణ

భూంపల్లి వాసులు నెల రోజులుగా విష జ్వరాలతో బాధ పడుతున్నారు. చిన్నా, పెద్ద అన్న తేడా లేదు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ అనారోగ్యం బారిన పడ్డారు. దీనికి తోడు ఇదే గ్రామంలో ఇద్దరు (రంజిత్, మాన్యశ్రీ) జ్వర బారిన పడి మృతి చెందడం, ఆశ కార్యకర్త కూతురే సీజనల్ వ్యాధులకు బలి కావడంతో గ్రామస్తుల్లో ఒకింత భయాందోళన నెలకొంది.

ఆర్‌ఎంపీల వైద్యంతోనే..

మరోవైపు, జ్వర మరణాలపై వైద్యాధికారులు చెబుతున్న అంశాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. భూంపల్లిలో ఇద్ద రు పిల్లలు మృతి చెందడానికి కారణం ఆర్‌ఎంపీలేనని వైద్యాధికారులు తెలిపారు. చనిపోయిన ఇద్దరు చిన్నారులకు డెంగీ, మలేరియా లేదని వైద్య పరీక్షల్లో తేలిందని సదాశివనగర్ మండల వైద్యాధికారి ఆస్మా సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల రన్విత్ రెండ్రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా, స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారన్నారు. ఆర్‌ఎంపీ హై డోస్ ఇంజెక్షన్ ఇచ్చిన పది నిమిషాల్లోనే రన్విత్‌కు ఫిట్స్ వచ్చాయని తెలిపారు. దీంతో గాంధారి దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడన్నారు. మరోవైపు, మాన్యశ్రీ(11) విషయంలోనూ ఇలాగే జరిగిందని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. జ్వరంతో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా, ఓవర్ యాంటీ బయోటిక్స్ ఇచ్చారన్నారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డి దవాఖానకు తరలించారని, అక్కడ ఐసీయూలో చికిత్స చేస్తుండగా రెండుసార్లు గుండెపోటు వచ్చిందని వివరించారు. దీంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ఊపిరితిత్తుల సమస్య (పల్మనరీ ఫెయిల్యూర్) తలెత్తి చిన్నారి మరణించిందన్నారు. ఇద్దరు చిన్నారులు డెంగీతో మృతి చెందలేదని, ప్లేట్‌లెట్స్ సైతం సరిగ్గానే ఉన్నాయని తెలిపారు.

వైద్య శిబిరాల ఏర్పాటు..

భూంపల్లిలో వ్యాధుల తీవ్రతపై నమస్తే తెలంగాణ వరుసగా వార్తలు ప్రచురించడం వైద్యాధికారుల్లో చలనం తెప్పించింది. మూడుసార్లు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో బృందం గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించింది. సోమవారం మరోమారు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారం పాటు కొనసాగుతుందని, గ్రామస్తులు చికిత్సలు పొందాలని సూచించింది.


గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరానికి బారులుతీరిన రోగులు

అందరికీ జ్వరాలే..



మా ఊళ్లే అందరికీ జ్వరాలే ఉన్నాయ్. ఇంట్ల ఓళ్లకు పాణం మంచిగ ఉంటలేదు. మొన్న మా మనువరాలు చిన్నపొల్ల జ్వర మొచ్చి సచ్చిపోయింది. యాడికెళ్లి అచ్చిందో ఈ గత్తర. మస్తు ఇబ్బంది పడుతున్నం. ఈ జ్వరాలు పోయేదాకా డాక్టర్లు మా ఊళ్లనే ఉండాలే. మంచి సూదులు, మందులు ఇయ్యాలే.

- మెగ్గం సాయవ్వ, భూంపల్లి వాసి

ప్రైవేట్ దవాఖానకు పోతున్నం



మా ఊరంతా ఆగమైంది. ఇద్దరు పిల్లలు చనిపోవడం బాధగా, భయంగా ఉంది. నెల రోజుల నుంచి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంట్ల చూసినా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. 15 రోజుల్లో రెండుసార్లు మెడికల్ క్యాంపులు పెట్టిండ్రు. అయినా జ్వరాల తీవ్రత తగ్గలేదు. కామారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి చూపించుకుంటున్నాం. డబ్బులు పోతున్నా ప్రాణాలు సక్కగైతలేవు. మా గ్రామస్తులందరికీ ప్రభుత్వం మంచి వైద్యం అందించాలి.

- దేవి సతీశ్, భూంపల్లి వాసి

పారిశుద్ధ్యం పడకేసింది..



వర్షాలు ప్రారంభమైన టైంల గ్రామంలో పారిశుద్ధ్య పనులు చక్కగా జరుగలేవు. అందుకే నెల రోజుల నుంచి ఊరంతా మంచం పట్టింది. పారిశుద్ధ్య పనుల మీద అధికారులను అడిగితే నిధుల్లేవు ఏం చేయమంటారని అంటున్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్లే విష జ్వరాలు విజృంభించాయి. అభం శుభం తెలియని చిన్నారులు మృతి చెందారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుద్ధ్యం మెరుగు పరచడంతో పాటు నాణ్యమైన వైద్యం అందించాలి

- పడిగెల రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ

డెంగీ..కేసుల్లేవు



భూంపల్లిలో కొద్దిరోజులుగా జ్వరాలు విజృంభిస్తున్న మాట నిజమే. మా సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తుండడంలో వ్యాధుల తీవ్రత తగ్గుముఖం పడుతున్నది. ఇద్దరు చిన్నారుల మృతికి డెంగీ కారణం కాదు. ఆర్‌ఎంపీ వైద్యులు ఓవర్ డోస్ ఇంజక్షన్లు ఇవ్వడం వల్లే వారు చనిపోయారు. గ్రామస్తులందరూ పూర్తి ఆరోగ్యవంతులయ్యే వరకూ మెడికల్ క్యాంప్ కొనసాగిస్తాం. పారిశుద్ధ్య సిబ్బంది సహకరించాలి.

- డాక్టర్ ఆస్మా, మండల వైద్యాధికారి

కూతురికి పెండ్లి కావడం లేదని..

తండ్రి ఆత్మహత్యాయత్నం చికిత్స పొందుతూ మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 26 : తన కూతురికి పెండ్లి సంబంధాలు కుదరడం లేదని తీవ్ర మనస్తాపం చెందిన ఓ తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఐదో టౌన్ ఎస్సై వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని లలితానగర్ కాలనీకి చెందిన కొత్వాల్ రామ్‌గోపాల్ (57) 15 ఏండ్లుగా మానసికస్థితి సరిగా లేక ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నాడు. తన కూతురి పెండ్లి విషయంలో ఆందోళన చెందిన ఆయన.. ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు దవాఖానలో చేర్పించగా..పరిస్థితి విషమించి మృతిచెందాడు. కొడుకు సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్, గంప గోవర్ధన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పాలకవర్గసభ్యులు

భిక్కనూరు,ఆగస్టు 26: కాచాపూర్ సింగిల్ విండో ఏర్పాటును హర్షిస్తూ భిక్కనూర్ మండలం బస్వాపూర్ సింగిల్ విండో కార్యాలయం ఎదుట తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ చిత్రపటాలకు పాలకవర్గ సభ్యులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2005లో కాచాపూర్ సొసైటీని అప్పటి మంత్రి షబ్బీర్ అలీ బస్వాపూర్ సొసైటీలో విలీనం చేశారని గుర్తుచేశారు. అప్పటి నుంచి 19ఏండ్ల పాటు కాచాపూర్ సొసైటీ రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. కాచాపూర్ సొసైటీని పునరుద్ధరించాలని 2023లో ప్రభుత్వ విప్‌గా ఉన్న గంపగోవర్ధన్‌ను కలిసి కోరగా అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలతో రెండు సొసైటీలుగా విభజించాలని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. కానీ కొంత మంది కాంగ్రెస్ నాయకులు.. షబ్బీర్ అలీ కాచాపూర్ సొసైటీని పునరుద్ధరించారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బస్వాపూర్ సొసైటీ చైర్మన్‌గా ఉన్న కిష్టాగౌడ్ రెండు పర్యాయాలు అవినీతికి పాల్పడి పబ్బం గడుపుతున్నాడని, అక్రమాలను త్వరలోనే నిరూపిస్తామన్నారు. విండో వైస్ చైర్మన్ మద్ది స్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ నాయకులు బుర్రి గోపాల్ పాల్గొన్నారు.